క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ జాతర



సంగం: స్థానిక తూర్పువీధిలో గంగమ్మ జాతర మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం గంగపెట్టె ఊరేగింపును వేడుకగా నిర్వహించారు. ముందుగా పెన్నానది వద్ద గంగపెట్టెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరికి నల్లి తెగులు

కలిగిరి: జిర్రావారిపాళెంలో సాగులో ఉన్న వరి పంటను వ్యవసాయశాఖ ఏడీ రామిరెడ్డి సోమవారం పరిశీలించారు. నల్లి తెగులు సోకినట్లు గుర్తించి సస్యరక్షణ చర్యలు సూచించారు. నల్లి సోకడంతో ఆకులు చివర ఎండిపోతున్నాయని తెలిపారు. నల్లి నివారణకు ఎకరాకు 400 మి.లీ ప్రొఫినోపాస్ లేదా 200 మి.లీ ఒబెరాన్ మందు పిచికారీ చేయాలని సూచించారు. వరి సాగులో రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఆయన వెంట ఏఓ సురేష్‌బాబు, వీఏఏ సుజాత, ఉన్నారు.

రసాభాసగా గ్రామసభ

చేజర్ల: మండలంలలోని ఉలవపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. సర్పంచ్ జీ అరుణ, పంచాయతీ కార్యదర్శి శీనయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ సర్పంచ్ షేక్ అస్రఫ్‌ఉన్నీసా మాట్లాడుతూ తమ హయాంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపించడం సరికాదన్నారు. ము చేసిన పనులకు సంబంధించి దాదాపు రూ.6,60,000 వరకు నగదు రావాల్సి ఉందన్నారు. తమకే బిల్లులు రాక వడ్డీలు కడుతున్నామన్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అధికారులు పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై సెక్రటరీ మాట్లాడుతూ పాత పనులకు సంబంధించిన బిల్లుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

బీసీజీ వ్యాక్సినేషన్

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 12 గ్రామ సచివాలయాల పరిధిలో 89 మంది వయోజనులకు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను వేసినట్లు వైద్యాధికారిణి కరిష్మా తెలిపారు. వయోజనులు తప్పనిసరిగా వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని సూచించారు. కాగా హుస్సేన్‌నగర్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సీహెచ్‌ఓ రాజశేఖరరాజు పరిశీలించారు.

చేపల దుకాణంలో చోరీ

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలో ఆదివారం అర్ధరాత్రి దొంగల్ హల్‌చల్ చేశారు. హిల్‌కాలనీలోని చేపల దుకాణం పైకప్పు రేకులు పగులగొట్టి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం దుకాణం యజమాని పెంచలయ్య చోరీని గుర్తించారు. కౌంటర్‌లోని రూ.23 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు వాపోయాడు. తెలిసిన వారే చోరీకి పాల్పడిన ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. అలాగే ప్రాజెక్ట్ కాలనీలోని చర్చిలోని బీరువాను దొంగలు పగులగొట్టారని స్థానికులు తెలిపారు.

కండాపురంలో కలకలం

చేజర్ల: మండలంలోని కండాపురంలో వాగు వద్ద నిమ్మ కాయలు పెట్టి పూజలు చేసిన ఆనవాళ్లు ఉండడంతో సోమవారం కలకలం రేగింది. వాటిని గమనించిన స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.. మరోమారు ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్నపురెడ్డికి సత్కారం

ఆత్మకూరు: పట్టణంలోని మేధా పాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ప్రధాన కార్యదర్శి, కవి అన్నపురెడ్డి పెద వేంకటరెడ్డిని ఆ సేవా సమితి కార్యవర్గ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఆత్మకూరుకు చెందిన కవి అన్నపురెడ్డి ఏలూరులో జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీసపద్య వైభవాన్ని వివరించి స్వర్ణకంకణం, కిరీటంతో సత్కారం అందుకోవడం అభినందనీయమని కొనియాడారు. సోమవరపు గోవిందరెడ్డి, కొల్లా వెంకటేశ్వర్లు, ఎస్వీ చలమయ్య, రమణయ్య, యానాదిరెడ్డి, నారాయణరావు, కంచి పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బెల్టు దుకాణం నిర్వహిస్తున్నారంటూ ఇద్దరిపై కేసులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు మొదలుపెట్టింది. ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన నరసయ్య చేజర్ల బస్టాండ్ సెంటర్ వద్ద మద్యం బాటిళ్లు ఉన్న బస్తాకు సమీపంలో నిలబడి ఉండగా ఆ బాటిళ్లు నీవేనంటూ ఎస్సై ప్రభాకర్ అతనిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా వైఎస్సార్‌సీపీ కార్యకర్త పంచేటి కృష్ణవేణి అనే ఆమె చెప్పడంతో మద్యం బాటిళ్లు తీసుకువెళుతున్నానని నరసయ్య చెప్పాడని, ఈ ఘటనకు సంబంధించి ఇరువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఇంకో విషయం ఏంటంటే వారం రోజుల క్రితం గ్రామంలో ముగ్గురు టీడీపీ మద్దతుదారులు బెల్టు దుకాణం నిర్వహిస్తుండగా.. పొదలకూరు సెబ్ సీఐ వెంకట్రావు 23 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. అయినప్పటికీ వారిపై ఇప్పటివరకు కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

చెట్ల కిందే పఠనం

- శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం
- దెబ్బతిని పెచ్చులూడుతున్న శ్లాబ్
- భయాందోళనలో పాఠకులు



శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

అనుమసముద్రంపేట: మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో గ్రంథాలయానికి వచ్చేందుకు పాఠకులు భయపడుతున్నారు. ఎవరైనా వచ్చిన ఆరుబయట చెట్ల కిందే కూర్చుని పుస్తక పఠనం చేస్తున్నారు. ఏఎస్‌పేటలో 1989లో రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాన్ని మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ బీ సుందరరామిరెడ్డి శంకుస్థాపన చేసి నూతన భవనాన్ని నిర్మించారు. ఎంతో మందికి విజ్ఞానాన్ని పంచిన గ్రంథాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ దెబ్బతిని ఉరుస్తోంది. దీంతో వర్షం పడితే గ్రంథాలయంలోని పుస్తకాలు తడిసి ముద్దవుతున్నాయి. శ్లాబు పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందని పాఠకులు గ్రంథాలయ భవనంలో కూర్చునేందుకు భయపడుతున్నారు. ఎవరైనా పాఠకులు వచ్చిన చెట్ల కిందనే కూర్చుని పుస్తక పఠనం చేసి వెళ్తున్నారు.

గ్రంథాలయ భవనంలోనే పశువైద్యశాల

గ్రంథాలయ భవనంలోనే మరో శాఖ కొనసాగుతోంది. శిథిలావస్థకు చేరిన గ్రంథాలయంలో పాఠకులు ఉండేందుకే చోటు లేకుంటే అదే భవనంలో పశువైద్యశాలను సైతం కొనసాగిస్తున్నారు. గ్రంథాలయ భవనంలోని కొద్ది భాగం పశు వైద్యశాలకు కేటాయించడంతో ఒకే రూములో డాక్టర్, మందులతో పాటు పశువులకు వైద్యం చేస్తున్నారు. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పశువైద్యశాల భవనం ఉన్నప్పటికీ జిల్లా అధికారుల నిర్లక్ష్యంతో పశువైద్యశాల గ్రంథాలయం వద్దే కొనసాగుతోంది. ఎన్నోసార్లు అధికారులు పరిశీలిస్తున్నప్పటికి ఏ ఒక్క భవనానికి న్యాయం చేయలేకపోతున్నారు. దీంతో గ్రంథాలయానికి వచ్చేందుకు పాఠకులు, విద్యార్థులు అనాసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.



శ్లాబ్ పెచ్చులూడి బయటపడిన కమ్ములు



చెట్ల కిందే పేపర్లు చదువుతున్న పాఠకులు

భయమేస్తోంది



గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో ప్రశాంతంగా వచ్చి పుస్తకాలు చదువుకోవాలంటే భయమేస్తోంది. గ్రంథాలయం లోపలకు వెళ్తే శ్లాబు పెచ్చులు పైన పడుతున్నాయి. దీంతో పుస్తకాలు చదవాలనే ఆసక్తి ఉండడం లేదు. నూతన భవనాన్ని నిర్మించి మరిన్ని పుస్తకాలు ఏర్పాటు చేయాలి.

–వాయిజ్, పాఠకుడు

చెట్ల కింద కూర్చోవాల్సి వస్తోంది



గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నా. గ్రంథాలయానికి వచ్చి ఎక్కువ సేపు పుస్తక పఠనం చేస్తుంటా. శిథిలావస్థకు చేరిన భవనంలో కూర్చుని భయంగా భయంగా చదవలేక చెట్ల కిందే కూర్చుని పుస్తక పఠనం చేస్తున్నా. ఎంతో మంది నిరుద్యోగులకు ఉపయోగపడే గ్రంథాలయం దుస్థితిలో ఉంది. గ్రంథాలయ భవనంలోనే పశువైద్యశాల ఉండడం వల్ల పాఠకులు ఆసక్తి కోల్పోతున్నారు. జిల్లా శాఖ అధికారులు స్పందించి తక్షణమే నూతన భవనాన్ని నిర్మించాలి.

– పరంధామయ్య, పాఠకుడు

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా గ్రంథాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ భవనంలో ప్రభుత్వమే పశుసంవర్ధక శాఖను ఏర్పాటు చేసింది. ఈ సమస్యను మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రీనివాసరాజు, లైబ్రేరియన్

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా

ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. 18 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా, ఉదయం 11 గంటల వరకు కేవలం ఆరు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఆ తర్వాత కొంత మంది అధికారులు నింపాదిగా వచ్చి రిజిష్టర్‌లో సంతకాలు చేసి వెళ్లారు. వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు ఆశించిన పరిష్కారం లభించక విసుక్కుంటూ వెనుదిరిగారు.

బండ్ల బాటను ఆక్రమించారని ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళ

సీతారామపురం: మండలంలోని కొయ్యలపాడులో సర్వేనంబర్ 111,113లోని దళితుల భూముల్లోకి వెళ్లే బండ్ల బాటను పలువురు రైతులు ఆక్రమించి దున్నారని బాధిత మహిళ తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. బండ్ల బాటను ఆక్రమించడంతో పొలాల్లోకి దారి లేకుండా పోయిందని విన్నవించారు. ఆక్రమణలపై ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నగల బ్యాగ్ పోగొట్టుకున్న ప్రయాణికురాలు

- గుర్తించి అందజేసిన రైల్వే సిబ్బంది



ప్రయాణికురాలికి బ్యాగ్‌ను అప్పగించిన రైల్వే పోలీసులు

కావలి: తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికురాలు హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకోగా కావలి రైల్వే పోలీసులు వెతికి దానిని బాధితురాలికి అప్పగించారు. సోమవారం రైల్వే ఎస్సై టి.అరుణ కుమారి వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన తాతా నాగశ్రావణి కుటుంబసభ్యులతో కలిసి కడప నుంచి విజయవాడకు తిరుమల ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత కావలి సమీపంలోకి వచ్చేసరికి హ్యాండ్ బ్యాగ్ పొరపాటున కిటికీలో నుంచి బయట పడిపోయింది. అందులో 14 సవర్ల బంగారు నగలు, కొంత నగదు ఉండడంతో బాధితురాలు వెంటనే కావలి జీఆర్పీ సిబ్బందికి ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీస్ టి.సురేష్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మహిళా కానిస్టేబుల్ పద్మ, బిట్రగుంట సెక్షన్ ట్రాక్‌మన్ పట్టాల వెంబడి గాలించి బ్యాగ్‌ను గుర్తించి నాగశ్రావణికి అందజేశారు.

మైనర్‌పై లైంగికదాడి దారుణం

కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్‌కు చెందిన నాల్గో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల మైనర్‌పై అదే ప్రాంతానికి చెందిన 53 ఏళ్ల మృగాడు కాపుకాసి లైంగికదాడికి పాల్పడడం అత్యంత దారుణమని కావలి ఉమెన్ ఫోర్స్ సభ్యులు సీ శారద, టీ సుజాత, షేక్ ఫాతిమా, షేక్ నూర్జహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. బాలికకు తక్షణమే వైద్యపరీక్షలు చేయాల్సిన కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు ఆలస్యంగా చేసి ఇంటికి పంపడం బాధాకరమన్నారు. బాధిత బాలికను ఇంటికి వెళ్లి పరామర్శించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పామన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడే దాక బాలికకు కావలి ఉమెన్ ఫోర్స్ అండగా ఉంటుందని తెలిపారు. కావలి టూటౌన్ పోలీసులను కలిసి ఫోక్సో సెక్షన్ కింద నమోదైన కేసు ఎఫ్ఐఆర్ కాపీని తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఫాస్ట్‌టాగ్ కోర్టు ద్వారా కేసును త్వరితగతిన విచారించి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

సాంకేతిక సమస్యలతోనే విద్యుత్‌కు అంతరాయం

బిట్రగుంట: బోగోలు మండలం చెంచులక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాంకేతిక సమస్యలు, పడమటి గాలుల తీవ్రతతో గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నాగూర్‌వలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల క్రితం సబ్‌స్టేషన్‌లోని 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే ఐదు రోజుల నుంచి వీస్తున్న పడమటి గాలుల తీవ్రత కారణంగా విద్యుత్ ఫీడర్స్ తరచూ ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పంట పొలాల్లో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను కూడా సరిచేసే చర్యలు చేపట్టినట్లు వివరించారు.

దాడి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ

సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో విద్యార్థి తండ్రిపై జరిగిన దాడి ఘటనపై విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామని ఎంఈఓలు జానకిరాం, కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మండల బీజేపీ నాయకులు విద్యాశాఖ అధికారులపై ఆదివారం చేసిన ఆరోపణలు సబబుకాదన్నారు. పాఠశాలలో విద్యార్థి తండ్రి బుజ్జిరెడ్డిపై జరిగిన దాడి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామని తెలిపారు. పాఠశాల అనుమతులు, పాఠశాలలో చదవుతున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల అభిప్రాయాలు, బుజ్జిరెడ్డిపై జరిగిన దాడి తదితర అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపామని చెప్పారు. జిల్లా అధికారులకు నివేదికను అందజేయనున్నామని తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నివేదికను అందజేయడం మాత్రమే తమ బాధ్యత అని, తదుపరి అంశాలు తమ పరిధిలోకి రావన్నారు. విద్యాశాఖ అధికారులపై బీజేపీ నాయకులు బురద జల్లడం సరికాదన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటకృష్ణకుమారి సోమవారం తెలిపారు. ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఇసుక డంపింగ్ యార్డు పరిశీలన



వాహనదారులకు సూచనలు చేస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులోని ఇసుక డంపింగ్ యార్డును ఎస్సై విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చిందని తెలిపారు. డంపింగ్ యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వాహనదారులు క్యూ పద్ధతిని పాటిస్తూ లోడింగ్ చేయించుకోవాలని సూచించారు. ఇసుక యార్డు వద్ద ఉన్న అధికారులకు ఇసుక కోసం వచ్చిన వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇసుక కోసం వచ్చిన వాహనదారులు సరైన పత్రాలు చూపించి రసీదు పొందాలని తెలిపారు.

పరిహారం చెల్లించే వరకు రోడ్డు పనులు నిలిపేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

సీతారామపురం: మండలంలో జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తులను కోల్పోయిన వారికి పరిహారం చెల్లించే వరకు నిర్మాణ పనులను ఆపాలని బాధితులు కోరారు. ఈ మేరకు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బాధితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతీయ రహదారులకు సేకరిస్తున్న భూములకు సంబంధించిన రైతులకు చెల్లిస్తున్న నష్టపరిహారం అంతంత మాత్రంగా ఉందన్నారు. రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్య వైఖరితో తూతూమంత్రంగా అంచనాలు వేయడంవల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. ఒకేరకమైన భూములు, ఇళ్లు, బావులకు పలు రకాలుగా అంచనాలు వేసి పంపడంతో బాధితులకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో సంబంధిత రెవెన్యూ యంత్రాంగం రీవాల్యుయేషన్ వేసి ఖచ్చితమైన అంచనాలు పంపాలని కోరారు. ఆరు లైన్ల రోడ్డు నిర్మాణ బాధితులకు ఎకరాకు రూ.12 లక్షలు, నాలుగు లైన్ల రోడ్డు బాధితులకు ఎకరాకు రూ.20 లక్షలు చొప్పున పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌డీ సంస్థ చైర్మన్ కలివెల ఎలీషాకుమార్, రైతు నాయకులు మద్దినేని శ్రీనివాసులు, యారవ మోహన్‌రెడ్డి, ఆదెయ్య, కరుణాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, పెద్దకాశయ్య, తిరుపతయ్య, చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతను పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

సోమశిల: రోడ్డు భద్రతను ప్రతిఒక్కరూ పాటించాలని ఆత్మకూరు ఎంవీఐ రాములు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అనంతసాగరంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రోడ్డు భద్రతపై శనివారం ఆయన అవగాహన కల్పించారు. 19 ఏళ్లలోపు వారు వాహనాలు నడపరాదన్నారు. ఒక వేళ నడిపితే ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించి వేగంగా వెళ్లకూడదన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. అలా నడిపితే మీతో పాటు ఇతరులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు. ట్రైయినింగ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపల్ ప్రభాకర్, వ్యాన్ డ్రైవర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్ వేడుకలు

ఆత్మకూరు/సంగం/ చేజర్ల/మర్రిపాడు: నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు శుభదిన్ కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో విద్యార్థులకు విందు భోజనం అందించారు. సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఈఓ గోపాల్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వెంగారెడ్డిపాళెంలో పాఠశాలలోని విద్యార్థులకు సర్పంచ్ ఆనం ప్రసాద్ రెడ్డి లడ్డూ, కారంబూంది, అరటిపండ్లు, పాయసం అందజేశారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. చేజర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దాతల సహకారంతో విందుభోజనం అందించినట్లు ఎంఈఓ-2 మస్తానయ్య తెలిపారు. మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని రెడ్డి రెడ్డప్ప, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంత రాజు, సీఆర్పీ కస్తూరయ్య సహకారంతో విందుభోజనం అందించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాకమిటీ చైర్మన్ దుంపల గడ్డ వెంకటేశ్వర్లు, దాతలను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ ధనలక్ష్మి, హెచ్ఎం పద్మాలత పాల్గొన్నారు.

ఉదయగిరి/ దుత్తలూరు/ సీతారామపురం /వరికుంటపాడు/జలదంకి: ఉదయగిరి మండలం బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో దాత జమ్మల వెంకటేశ్వర్లు పండ్లు, మిఠాయిలను అందజేశారు. ఎంఈఓ తోట శ్రీనివాసులు పాల్గొన్నారు. ఉదయగిరి ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ షేక్ గాజుల జాఫర్‌సాహెబ్ కుటుంబీకులు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. దుత్తలూరు మండలం తెడ్డుపాడు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం విద్యార్థులకు విందుభోజనం అందించారు. ఎంఈఓ-2 వెంగయ్య, హెచ్ఎం మల్లికార్జున పాల్గొన్నారు. సీతారామపురంలోని కోటవీధి పాఠశాలలో ఎంఈఓ మస్తాన్‌వలి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. జలదంకి మండలం అన్నవరం పాఠశాలలోని విద్యార్థులకు పూనూరు రామకృష్ణారెడ్డి విందు భోజనం అందించారు. వరికుంటపాడు మండలం తూర్పుబోయమడుగుల పాఠశాలలోని విద్యార్థులకు వ్యాపారవేత్త మేడసాని చైతన్య తన కుమార్తెలు సాయి తన్వి, చతుర్వి పుట్టినరోజు సందర్భంగా విందు భోజనం ఏర్పాటు చేశారు.

రిమార్కులు లేకుండా తొలగించొద్దు

చేజర్ల: రిమార్కులు లేకుండా ఉపాధి సిబ్బందిని తొలగించొద్దని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఉపాధి ఏపీఓ వెంకటేశ్వర్లుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పాడేరుకు సంబంధించిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ బీ కొండారెడ్డి గత కొంత కాలం నుంచి విధులు సక్రమంగా నిర్వహిస్తున్నాడని తెలిపారు. అతనిని తొలగించాలని టీడీపీ నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. అతనిపై ఎలాంటి రిమార్కులు లేవని, అతనిని తొలగించి కొత్త వారిని విధుల్లోకి తీసుకుంటే అధికారులు తీవ్రపరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బీజేపీ నాయకులు కుంకు బాలయ్య, బత్తల కృష్ణయ్య, విజయభాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీచ్ టూల్‌పై శిక్షణ



ఇన్‌చార్జి ఎంఈఓ జ్యోతికి సత్కారం

ఆత్మకూరు: పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో గత తొమ్మిది రోజులుగా ఉపాధ్యాయులకు టీచ్ టూల్‌పై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఆత్మకూరు డిప్యూటీ డీఈఓ గోపాల్ పర్యవేక్షణలో బ్యాచ్‌ల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు నూతన అంశాలతో పాటు పాఠ్యాంశాలను సులభతరంగా అర్థమయ్యేలా నేర్పడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు టీచ్ టూల్ ద్వారా బోధన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని సూచించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఎంఈఓలను డిప్యూటీ డీఈఓ గోపాల్ సన్మానించారు.

జాతీయ స్థాయి పోటీలకు కొత్తసత్రం విద్యార్థులు



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కావలి : మండలంలోని కొత్తసత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పాఠశాలలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాణించి జాతీయస్థాయికి ఎంపికవడం హర్షించదగిన విషయమన్నారు. అండర్ -12 విభాగంలో ఏడో తరగతి విద్యార్థిని ఎల్లంగారి జ్యోతి మూడు నిమిషాల స్పీడ్, మరో విద్యార్థిని పామంజి సరిత 30 సెకండ్ల స్పీడ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. వాయిల శాలిని ఫ్రీ స్టయిల్ విభాగంలో, అండర్-14 విభాగంలో ఎల్లంగారి కల్పన 30 సెకండ్ల స్పీడ్‌లో రెండోస్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. పీడీ మురళి మాట్లాడుతూ నలుగురు విద్యార్థులు ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో పాటు పీడీ మురళిని ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు డీబీఎస్ విద్యార్థిని



మల్లీశ్వరిని అభినందిస్తున్న సుధీర్‌నాయుడు

కావలి : డీబీఎస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని కొండూరి మల్లేశ్వరి రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీబీఎస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు తెలిపారు. సోమవారం మల్లేశ్వరిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27,28 తేదీల్లో వైఎస్సార్‌జిల్లా వేంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో తమ కళాశాల విద్యార్థిని విజయం సాధించి జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి , భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షించదగిన విషయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ టీవీ రావు, పరిపాలన అధికారి జీ రమేష్‌బాబు, అధ్యాపకులు దామోదరరెడ్డి, పీడీ శివసాగర్ పాల్గొన్నారు.